www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025
5
వైఎస్ఆర్

నవంబర్‌లో బాలోత్సవం

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప బాలోత్సవం నవంబర్ 29, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బాలోత్సవం అధ్యక్షులు గోపాల్ తెలిపారు. గురువారం బాలాజీ నగర్‌లోని ఎస్‌బి ఇంజినీరింగ్ కళాశాలలో కడప బాలోత్సవం ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 అంశాల్లో 54 విభాగాలుగా 6 వేదికలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గౌరవాధ్యక్షులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ కడప బాలోత్సవం వైవీ యూనివర్సిటీ, వైఎస్ఆర్ ఫైనాన్స్ యూనివర్సిటీ జట్టులుగా అకడమిక్, కల్చరల్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజలు ఆర్థికంగా, హార్దికంగా సహకరించాలని కోరారు. సమావేశంలో గౌరవ సలహాదారులు వీర సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, కోశాధికారి సునీత, వివిధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాం, వెంకటేశ్వర్లు, రఘునాథ రెడ్డి, యల్లేశ్వరరావు, మధుసూదన, డాక్టర్ రామమునిరెడ్డి, కృష్ణయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, కెవిపి నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల నివాస ప్రాంతాల్లో వసతులు కల్పించాలి

- మున్సిపల్ క్వార్టర్స్‌లో పర్యటించిన యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

మున్సిపల్ కార్మికులు నివాసం ఉంటున్న శంకరాపురం మున్సిపల్ క్వార్టర్స్‌లో తగిన వసతులు కల్పించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు గురువారం పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి యాత్రను ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు నివాసముంటున్న ప్రాంతాలలో మౌలిక వసతులు దుర్భరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల ఇళ్ల చుట్టూ అపరిశుభ్రత, డ్రైనేజీ, ఎలక్ట్రికల్ పోల్స్ లేకపోవడం కార్మికులను అంధకారంలో నెట్టివేస్తుందని తెలిపారు. క్వార్టర్స్ చుట్టూ తాగునీటి కోసం పైప్ లైన్ లేకపోవడం దుర్మార్గమని చెప్పారు. నగరం మొత్తం పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికులు నివసిస్తున్న చోట కనీసం విద్యుత్తు స్తంభాలు, లైట్లు,తాగునీటి పైపు లైన్ సౌకర్యం, మంచి రోడ్లు లేవని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు వ్యవస్థను భ్రష్టు పట్టించారని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు నివసిస్తున్నారని చెప్పారు. పాదయాత్రలో మున్సిపల్ యూనియన్ నగర సహాయ కార్యదర్శి ప్రకాష్, సభ్యులు నాగరాజు, నివాసం ఉంటున్న కార్మికులు వడ్లపల్లి రమణ, శాంతమ్మ, గున్నా రవి, పర్మనెంట్ కార్మికులు రోడ్డా శివ, కొండయ్య పాల్గొన్నారు.

క్వార్టర్స్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ నాయకులు

గ్రామాల్లో సుస్థిర ఆదాయ మార్గాలను

అభివృద్ధి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సుస్థిర ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఉద్యాన, మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. గురువారం 'ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా నీటి భద్రత – గ్రామీణాభివృద్ధి' అనే అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర జలశక్తి అభియాన్ శాఖ మంత్రి సిఆర్.పాటిల్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కడప కలెక్టరేట్ లోని విసి హాలు నుంచి కలెక్టర్ హాజరయ్యారు. కేంద్ర మంత్రుల విసి ముగిసిన అనంతరం డ్వామా, ఉద్యాన, మండల అభివృద్ధి అధికారులు, అనుబంధ శాఖల అధికారులతో ఎన్ఆర్ఇజిఎస్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న, చేపట్టాల్సిన వివిధ రకాల పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ షెడ్లు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన పంటలను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. అందుకోసం డ్వామా, ఉద్యాన, మండల అభివృద్ధి అధికారులు, అనుబంధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం లోపు ఒక్క లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తేవాలని, అందులో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి కనీసం 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్వామా, భూగర్భజల శాఖ అధికారుల సహకారంతో నీటి వనరులను పెంపొందిస్తూ ప్రణాళిక ప్రకారం వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సాగుతో పాటు 60శాతం పైగా ఉద్యానసాగును, మిగిలిన సూక్ష్మ శాతాన్ని పశు సంపదతో పునరుజ్జీవ కల్పన సాధించాలన్నారు. పశుసంవర్ధక వైపు మళ్లించేందుకుసుస్థిరమయిన వనరులను సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో డ్వామా పిడి అదిశేషారెడ్డి, భూగర్భ గనుల శాఖ డిడి మురళీధర్, ఇరిగేషన్ అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఒలు, డ్వామా, ఎపిడిఒలు, ఎపిఒలు, ఉద్యాన శాఖ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

జిఎస్‌టి పన్నుల తగ్గింపుపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కడప కలెక్టరేట్‌లోని విసి హాలులో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈనెల 25 నుంచి అక్టోబర్ 19 వరకు జిఎస్‌టి తగ్గింపుపై ప్రజల్లో అవగాహన, వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 25 నుంచి 29 వరకు స్వయం సహాయ సంఘాలు, గ్రామ సంఘాలు, గ్రామ/వార్డు సచివాలయం సమావేశాలు, వ్యాపార సంస్థల ద్వారా ఇంటింటికీ వెళ్లి జిఎస్‌టి పన్నుల తగ్గింపుపైనా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే అంశాలపై ప్రజలకు వివరించాలన్నారు.

కడప విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

కడప ఎయిర్ పోర్ట్ నూతన భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఎంపి నవీన్ విశ్వనాథ్ తోకలిసి కడప ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటీకి సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో భాగంగా నిరంతర నీటి సరఫరా, మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కమిటీ చర్చించింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందని చెప్పారు. ఎయిర్ పోర్ట్ పరిసరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో కడప మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పొద్దార్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఎపిఎస్‌పిడిసిఎల్ రమణ, అగ్నిమాపక అధికారి ధర్మారావు, ఎయిర్ పోర్ట్ డిజిఎంలు రాజేశ్వర్, తిరుమల మురగన్, ఆపరేషన్ ఇన్‌ఛార్జి దామోదర్, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ రహిత జిల్లా మనందరి బాధ్యత

జిల్లాను పర్యావరణ రహిత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత మన అందరి చేతుల్లో ఉందని, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్' పై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న విధివిధానాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలన్నారు. చాలా ప్రాంతాల్లో ఆసుపత్రుల ఉత్పన్నమయ్యే బయో మెడికల్ చెత్తతోపాటు బయో వేస్టేజీని కలిపి మున్సిపల్ వేస్తున్నారని, బయో వ్యర్థాలపై అవగాహన, దాని ప్రమాదస్థాయిని ఆసుపత్రుల యాజమాన్యాలు గుర్తెరిగేలా అవగాహన పెంచాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, ఫ్యాక్టరీల సంఖ్య అవి ఉత్పత్తి చేసే వ్యర్థాలు, వాటి నిర్వహణ పనితీరు ఎలా జరుగుతుంది..? అన్న అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

దసరా సెలవుల సందర్భంగా బయట ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంటికి బలమైన తాళాలు వాడాలని, ఇంటి ప్రధాన, వెనుక తలుపులు, బాల్కనీలకు బలమైన తాళాలు వేసి భద్రపరచుకోవాలని సూచించారు. విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదని చెప్పారు. నగలు నగదు, ముఖ్యమైన పత్రాలను బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు. ఇంటి గేట్లకు బయట తాళాలు వేయవద్దని, లోపల తాళం వేసుకోవడం క్షేమమని తెలిపారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. పోలీసులు వివిధ సమయాల్లో పర్యవేక్షణ చేస్తారన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటి వారు కన్పిస్తే అనిపిస్తే ఫోటో తీసి డయల్ 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇన్‌ఛార్జి మేయర్‌గా ముంతాజ్ బేగం

ప్రజాశక్తి - కడప అర్బన్



మేయర్ పదవి నుంచి సురేష్ బాబును ప్రభుత్వం తొలగించిన దృష్ట్యా ఆయన స్థానంలో డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముంతాజ్ బేగంకు ఇన్‌ఛార్జి మేయర్ బాధ్యతులను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సర్వసభ్య సమావేశాలు నిర్వహించదలిస్తే ఇన్‌ఛార్జి మేయర్ అధ్యక్షతన కొనసాగే అవకాశం ఉంది. నగర అభివృద్ధికి సంబంధించిన ఎన్నో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి వాటిని ఆమోదించుకోవాలని కూటమి నాయకులు భావిస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో కలపాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో కలపాలని అసోసియేషన్ నాయకులు ఆర్‌టిసి ఎమ్‌డిని కోరారు. ఆర్‌టిసి కడప డిపో ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుని ఎపిపిటిడి(ఆర్‌టిసి) అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా ఆర్‌టిసిలో కాంట్రాక్టు వ్యవస్థ వల్ల రోజురోజుకూ కార్మికులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. యాజమాన్యం నిర్ణయించిన జీతాలు రాష్ట్ర మొత్తం మీద ఏ కార్మికుడి అందుకోని పరిస్థితులపై అధ్యయనం చేస్తూ, కాంట్రాక్ట్ వ్యవస్థను సమూలంగా రద్దు చేసి ప్రతి కార్మికుడికి యాజమాన్యం ద్వారా జీతాలు అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఏర్పడిన ఖాళీలపై ఎన్నో ఏళ్లుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు పని అనుభవం, నైపుణ్యత వుండి కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చాలా ఏళ్లుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులకు కేడర్ స్ట్రెంత్ కారణం చేత కొన్ని జిల్లాల్లో కార్మికులను అన్యాయంగా విధుల నుంచి తొలగించారని తెలిపారు. దీని వల్ల ఆ కార్మికుడి కుటుంబాలు రోడ్డు మీద పడుతుందని చెప్పారు. ఆ కార్మికుడికి వేరే చోట ఉద్యోగం కల్పించేలా చూడాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బాలుడు అప్పగింత

ప్రజాశక్తి - కడప

పారిపోయిన బాలుడు జి.రంగస్వామిని చైర్‌పర్సన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కడపకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ గురువారం అప్పగించింది. జిల్లాలోని బ్రహ్మంగారి మఠానికి చెందిన గుర్రం గురులక్ష్మి తన కుమారుడు గుర్రం రంగస్వామి పారిపోయాడని, ఎక్కడ ఉన్నారో తెలియడం లేదని, తన కుమారుని అప్పగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తికి యామినికి విన్నవించారు. స్పందించిన ఆమె వెంటనే సీనియర్ సివిల్ జడ్జికి బాలుడిని వెతికే బాధ్యతను అప్పగించారు. జడ్జి పోలీసు వారి సహకారంతో బ్రహ్మంగారిమఠంలో నివాసముంటున్న తల్లిగారి ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీశారు. రంగస్వామిని పోలీసుల సహకారంతో ఆచూకీ కనుక్కొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆమె బాలుడితో మాట్లాడి వెంటనే చైర్ పర్సన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కడప వారిని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రజనీకి నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి- కడప అర్బన్

చిన్నచౌక్‌లోని జిఆర్‌టి జివికె స్కూల్ డైరెక్టర్ జి.రజనీకి నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు–2025 అందజేశారు. గురువారం హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో 'శారద ఎడ్యుకేషనల్ సొసైటీ' ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కడప నగరానికి చెందిన జి.రజనీకి నిర్వాహకులు పురస్కారాన్ని అందజేశారు. విద్యారంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గత వారంలో గుంటూరులో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో 'ఐకానిక్ బెస్ట్ టీచర్ అవార్డ్' సైతం పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జిఆర్‌టి జివికె విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ జి. శంకర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రపంచ ర్యాంకింగ్ జాబితాలో ఏడుగురికి చోటు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన పరిశోధకుల జాబితాతో ఏడుగురికి చోటు లభించిందని ఎల్‌విపిఇఐ నేత్ర వైద్యశాల హెడ్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లఠ మాట్లాడుతూ ఏడుగురు ఎలవిపిఇఐ అనుబంధ క్లినిషియన్ శాస్త్రవేత్తలు జీవితకాల ర్యాంకింగ్స్‌లో 15 మంది చోటు దక్కించుకున్నారని చెప్పారు. అందులో నేత్రవైద్య రంగంలో తమ కృషికిగాను భారతదేశం నుంచి, ఎల్‌విపిఇఐకి చెందిన ఏడుగురు పరిశోధకులు నేత్రవైద్య జీవితకాల ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలి

- జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్

విద్యార్థులు తమ భవిష్యత్తును మెరుగు పరుచుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్ అన్నారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జర్మన్ లాంగ్వేజ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను సురేష్ కుమార్ ప్రత్యక్షంగా కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా మాటాడుతూ జర్మన్ భాష ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అవకాశాలు కలిగిన భాషలలో ఒకటి అని పేర్కొన్నారు. నర్సింగ్ రంగంలో ముఖ్యంగా జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉన్నాయని, అక్కడి ఆసుపత్రులు, హెల్త్ కేర్ సెంటర్లు నైపుణ్యమున్న నర్సింగ్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని వివరించారు. జర్మన్ లాంగ్వేజ్ సర్టిఫికేషన్ పొందిన విద్యార్థులకు జర్మనీ సహా యూరప్ దేశాలలో మంచి స్థాయిలో ఉద్యోగాలు లభిస్తున్నాయని, దీంతో పాటు గౌరవప్రదమైన జీతభత్యాలు లభిస్తాయని చెప్పారు. శిక్షణ ద్వారా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కెరీర్ నిర్మించుకునే అవకాశం పొందుతారని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకు ముడత పురుగుతో ఆందోళన వద్దు

ప్రజాశక్తి-కాశినాయన

ఆకు ముడత పురుగుతో రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ విస్తరణ అధికారి బి.రవి పేర్కొన్నారు గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాలలో వరి పంటను పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఆకు ముడత పురుగు రెండు ఆకులను ముడతగా చేసి, ముడతలో ఉండి, ఆకు పత్ర హరితం తినడం వల్ల ఆకులు తెల్లగా మారుతుండటం గమనించవచ్చని, దీన్ని రైతులు 'మజ్జిగ తెగులు', లేదా 'తెల్లతెగులు' అంటారని పేర్కొన్నారు. ఈ పురుగు వల్ల పంటకు నష్టం ఉండదని చెప్పారు. ముందుగా యూరియా ఎరువులను పూర్తి స్థాయిలో నిలుపుదల చేయాలని, పురుగు ఉధృతిని బటిట పంట చిన్న వయసులో ఉన్నప్పుడే 'కార్టాప్ హైడ్రోక్లోరిడ్' 250 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఇంకా ఎక్కువగాపురుగు ఉంటే 'కోరజేన్' 80 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తోంద,ఇ వెంటనే చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గోపవరం విద్యాశాఖ అధికారికి, బద్వేల్ మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి అక్టోబర్ 2వ వరకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని చెప్పారు. పట్టణంలోని ప్రయివేట్ స్కూల్ యాజమాన్యం, అధికారులు ప్రభుత్వ ఆదేశాలను తుంగలోకి తొక్కి వారికి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. సెలవులు ఇవ్వకుండా క్లాసులు నిర్వహిస్తున్నారని అలాంటి వారి పైన జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. స్పెషల్ క్లాసులు పేరుతో పాఠశాలలో నడుపుతున్నటువంటి పాఠశాలలో గుర్తింపు రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు పాటించినటువంటి ప్రైవేట్ స్కూల్స్ పర్మిషన్ రద్దు చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు నరసింహ చరణ్ పాల్గొన్నారు.

రేపు ఎన్‌టిఆర్ సర్కిల్‌లో నాతియా మేహిఫీల్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రచారాన్ని ప్రారంభిస్తున్న సుభాన్ బాషా

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఈనెల 27న నిర్వహించే నాతియా మేహిఫీల్ కార్యక్రమానికి భారతదేశ వ్యాప్త ప్రముఖ కవులు రాబోతున్నారని వికాస్ విద్యాసంస్థల అధినేత సుభాన్ బాషా పేర్కొన్నారు. గురువారం నాతీయ మేహిఫీల్ కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ తన తల్లితండ్రుల ఆశీస్సులు, కుటుంబం సహాయ సహకారాలతో గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా మీలాద్ ఉన్ నభి కార్యక్రమం నిర్వహించడం తన ధర్మమని అన్నారు. నాతియా మేహిఫీల్ కార్యక్రమాలకు కులమాతలాలు అతీతంగా ప్రజలు పాల్గొంటారని చెప్పారు. వారి కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుల్తాన్ బాబా, ఉస్మాన్ ఖాన్, రఫీవుద్దీన్, బాబు, అల్లాబకష్, షబ్బీర్, మహమ్మద్, మాయనా ఖాజా, దస్తగిరి, బదుల్లా, మహామ్మద్ మౌజన్, అయ్యప్ప, బాబా పాల్గొన్నారు.

కూటమి పాలనలో అక్రమాలే

ప్రజాశక్తి - కడప : కూటమి ప్రభుత్వ పాలన మొత్తం అవినీతి అక్రమాలే అని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో అవినీతి చేయడమే లక్ష్యంగా అరాచకాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఎరువులు, యూరియా అందక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులను ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి కన్పించడం లేదని పేర్కొన్నారు. మాటల గారిడితో ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని విమర్శించారు. బినామీలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అప్పగించాలని చూస్తున్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కూష్మాండదేవిగా శ్రీవిజయదుర్గాదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడప శ్రీ విజయదుర్గాదేవి 4వ రోజున కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వేకువజామున 36 విశేష పవిత్ర నది జలాలు నింపిన కళాశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష షోడశోపచార పూజలు , మంగళహారతులు నిర్వహించారు. ఆలయ యగశాలలో చండీహోమ కార్యక్రమాలు, శ్రీచక్రమండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ విజయదుర్గాదేవికి చతుషష్ఠి ఉపచార పూజ చేశారు. అమ్మవారు కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ విజయదుర్గా మల్లికార్జునులు సింహ వాహనంపై ఆలయం చుట్టు మంగళవాయిద్యాలు, కోలాటం, అశేష భక్తుల నిరాజనాల మధ్య ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కడప అర్బన్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయబ్ రసూల్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడం కోసం ఉదయం 11 గంటలకు సిఐటియు జిల్లా కార్యాలయం ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా కడపలో రౌండ్ టేబుల్ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజాతంత్ర వాదులు, మేధావులు, విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు హాజరై న్యాయమైన డిమాండ్ల పరిష్కారం వరకు చేపట్టబోయే కార్యచరణకు తమ విలువైన సలహాలు, సూచనలు, మద్దతు తెలియజేయాలని పేర్కొన్నారు.

సామాజిక రుగ్మతలను తొలగించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కడప : జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జెసి అదితి సింగ్, జిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్.. సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెసి, ఎస్పితోపాటు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం జరగకుండా చర్యలు చేపడుతోందన్నారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తారన్నారు. ఎస్పి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు పోక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచిజిల్లా స్థాయి వరకు బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో అన్ని కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, డిఎస్‌పిలువెంకటేశ్వర్లు (కడప), భావన (ప్రొద్దుటూరు), మురళి (పులివెందుల), రాజేశ్వర్ రెడ్డి (మైదుకూరు) పాల్గొన్నారు.

రేపు వేదాంత ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఐటిఐ సర్కిల్, అక్కాయపల్లె పార్క్ ఎదురుగా ఉన్న వేదాంత హాస్పిటల్స్‌లో ఈనెల 27న ప్రొస్టేట్ గ్రంధి సమస్యపై పురుషుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కిడ్నీ, మూత్ర పిండాల వ్యాధి నిపుణులు డాక్టర్ ఎన్. దినేష్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొస్టేట్ గ్రంధి పురుషుల్లో వీర్యాన్ని ఉత్పత్తి చేసే, మూత్ర ప్రవాహాన్ని నియంత్రించే గ్రంధి అని తెలిపారు. ఇది మూత్రశయం కింద ఉంటుందని పేర్కొన్నారు. ప్రొస్టేట్ గ్రంధి పెద్దదిగా మారి మూత్ర ప్రవాహాన్ని అడ్డుకుంటుందని తెలిపారు. ఇన్ఫెక్షన్, కేన్సర్ సమస్యలు ఉంటాయని పేర్కొన్నారు. మూత్రం సన్నగా రావడం, ఎక్కువసార్లు రావడం, మంట, రక్తం, తొందరగా రావడం వంటి లక్షణాలుంటాయని తెలిపారు. ఇలాంటి సమస్య ఉన్నవారు యూరాలజీ వైద్యుడిని సంప్రదించాలని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారిలో ఎక్కువగా పై లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి వారి కోసం వేదాంత హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఒపిడి, పిఎస్ఎ, మూత్రం త్వరగా రావడం వంటి పరీక్షలు రూ.2వేలు విలువ చేస్తాయని వీటిని ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్‌లో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9666015678లో సంప్రదించాలని తెలిపారు.

బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కడప : బ్యాంకింగ్ విధి, విధానాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంకు రీజినల్ హెడ్ బి. అరుణ జ్యోతి అన్నారు. గురువారం కడప నగరం ఏడు రోడ్ల సర్కిల్ వద్ద ఆగ్మెంటెడ్ కస్టమర్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ జ్యోతి మాట్లాడుతూ కస్టమర్ లైఫ్ సర్టిఫికేట్, డెత్ క్లెయిం, నామినేషన్ వంటి సేవలపై కేంద్రీకరించబడింది అని అన్నారు. కస్టమర్ అవేర్‌నెస్ ప్రాధాన్యం, భద్రతతో కూడిన, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు ఎస్. రమేష్, విష్ణువర్ధన్ ప్రజలకు మార్గనిర్దేశనం చేసి, 'ఆగ్మెంటెడ్ కస్టమర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్'పై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. **నెహ్రూ పార్కులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం..** స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రాంతీయ అధికారి బి. అరుణ జ్యోతి ఆధ్వర్యంలో కడప నెహ్రూ పార్కులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది అందరూ చురుకుగా పాల్గొని పార్కును శుభ్రపరచడమే కాకుండా మిషన్ లక్ష్యాలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభించింది. మహత్తర కార్యానికి తోడ్పడినందుకు కెనరా బ్యాంక్ గర్వంగా భావిస్తోంది అని ఈ సందర్భంగా అరుణ జ్యోతి అన్నారు.

అవగాహన ర్యాలీలో రీజినల్ హెడ్ అరుణ జ్యోతి, బ్యాంకు అధికారులు, సిబ్బంది

స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తున్న టిడిపి నాయకులు

ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తుంగభద్ర ప్రోజెక్టు హైలెవెల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. గురువారం పులివెందుల మున్సిపాలిటీలోని ఎర్రగుడిపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మారెడ్డి జోగిరెడ్డి, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామరెడ్డి, హజ్ కమిటీ మెంబర్ మా బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు ఎంపికైన అమర్నాథ్ యాదవ్ లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డ్ ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లో కొంతమందికి ఇంకా కొన్ని పొరపాట్లు ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. మార్పులు ఏవైనా ఉంటే అక్టోబర్ 31లోపు చేయించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగుడి పాలెం టీడీపీ నాయకులు రామాంజనేయులు, రహంతుల్లా, మునెయ్య, శివాం జినే యులు, అధికారులు పాల్గొన్నారు

కొండాపురం : మండలంలోని గండ్లూరు ఓబన్నపేట, సీతాపురం గ్రామాల్లో గురువారం టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, గండ్లూరు శంకర్‌రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండ్లూరు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించేందుకు వీలుంటుందన్నారు. అవినీతి అక్రమాలను కట్టడి చేసేందుకు స్మార్ట్ రేషన్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ కార్డును పొంద డానికి కెవైసి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిపి వైస్ ప్రెసిడెంట్ అనిశెట్టి హరికృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్డులను పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

ఉల్లి రైతులతో మాట్లాడుతున్న రైతు నాయకులు

ఉల్లి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గిట్టుబాటు ధర లేక, పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్న ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. గురువారం మైదుకూరు మండలం లింగాలదిన్నె గ్రామంలో ఉల్లి పంట పండించి నష్టపోతున్న రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అధిక మొత్తం వెచ్చించి ఉల్లిపంట సాగు చేస్తే, దిగుబడి వచ్చింతర్వాత పంటన కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కొనుగోలు చేసి రైతును ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం హెక్టార్‌కు రూ.50 వేలు సాయం చేస్తామని చెప్పి ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల పక్షాన నిలబడి ఉద్యమించాల్సిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం దారుణమన్నారు. కార్యక్రమంలో మైదుకూరు పట్టణ సమితి అధ్యక్షుడు రామ్మోహన్, లింగాలదిన్నె గ్రామ రైతు నాయకుడు చాగలమర్రి సిద్దయ్య, వంకాయల చిన్న సుబ్బన్న, తప్పెట వెంకటసుబ్బయ్య, పెద్ద సుబ్బన్న, చాగలమర్రి బాబయ్య, ఫక్రుద్దీన్, పెద్ద సుబ్బన్న పాల్గొన్నారు.

సినిమా పోస్టర్ విడుదల చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి, జాకీర్ అహ్మద్

డైమండ్ డెకాయిట్ సినిమా పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ప్రొద్దుటూరు సినీహబ్ థియేటర్లో బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జాకీర్ అహ్మద్ గురువారం డైమండ్ డెకాయిట్ సినిమా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసిగా జిల్లాలో 50పైగా లొకేషన్‌లో సినిమా తీయడం శుభ పరిణా మ మన్నారు. యువత ముందుకు వచ్చి సినిమా రంగానికి రాయలసీమలోనే సిని మా షూటింగ్ చేయడం చాలా సంతోషకరమన్నారు. జాకీర్ అహ్మద్ మాట్లా డుతూ సినిమా హీరో పార్థు గోపాల్ గతంలో కూడా శ్రీమంతుడు సిని మాలో చిన్న రోల్‌లో నటించి ఈరోజు పూర్తి సినిమాలో హీరోగా నటించడం అభినం దనీయమన్నారు. గండికోటలో సినిమా తీయడం వల్ల కడప జిల్లా అభి వృద్ధికి సినిమా పరంగా ప్రభుత్వం తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం సినీ హీరో పార్థు గోపాల్, దర్శకులు సూర్య జి యాదవ్ మాట్లా డుతూ రెండేళ్ల శ్రమ ఫలితం ఈ సినిమా అన్నారు. కడప జిల్లా వాసిగా సినిమా తీయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో జిల్లా వాసి అయిన బిఎన్ రెడ్డి సిని మా రంగానికి ఎంతో కృషి చేశారన్నారు. మన ప్రజా సేవా సమితి వ్యవ స్థాపక అధ్యక్షులు అయూబ్‌ఖాన్, గంగా ప్రసాద్, ఓబులేసు, నారాయణ, ఫరాన్ పాల్గొన్నారు.

ఎపి జెన్‌కో ఎమ్‌డి నాగలక్ష్మికి అభినందనలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా ఎస్.నాగలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-129 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడ విద్యుత్ సౌధ భవ నంలో కలిశారు. ఈ సందర్భగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీ, అంకిత భావం కలిగిన అధికారిగా పేరున్న నాగలక్ష్మి నేతృత్వములో ఎపి జెన్‌కో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలు కూడా త్వరగా పరిస్కారం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. అందరి సహకారంతో సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని, ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై మరోసారి తనను కలవాలని ఆమె చెప్పారని తెలిపారు. సాధ్యమైనంత వరకు సానుకూలంగా ఉంటానని ఎండీ చెప్పారని అన్నారు. నాయకులు మోహన్‌రావు, రవి, సుబ్బారావు, వలి ఉన్నారు.

ఎమ్‌డికి అభినందనలు తెలుపుతున్న యునియన్ నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

అర్హులకు భూములు మంజూరు చేయాలి - పాపిరెడ్డిపల్లె ప్రాంతంలో సిపిఎం పర్యటన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కబ్జా యత్నానికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పాపిరెడ్డిపల్లె, పలుగు రాళ్లపల్లె పార్ట్ ఫోర్ రెవెన్యూ పొలం 247 సర్వేనెంబర్‌లో మూడు రోజుల క్రితం భూ కబ్జాదారులు యంత్రాలతో చదును చేసి ఆక్రమించే ప్రయత్నం చేసిన పొలంలో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివ కుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీ పర్యటించింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 247 సర్వే నెంబర్లో గతంలో పాపిరెడ్డిపల్లె ఎస్సి, బీసీ కుటుంబాలకు అసైన్మెంట్ కమిటీలో పట్టాలు మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. వాటిని సర్వే చేసి చూపకపోవడంతో లబ్ధిదారులు భూముల్లోకి వెళ్లలేక పోయారని పేర్కొన్నారు. దీన్ని అదునుగా చూసుకొని రాజకీయ పలుకుబడి కలిగిన వారు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. మూడేళ్ల క్రితం ఇదే పద్ధతుల్లో ఆక్రమించే ప్రయత్నం చేస్తే సిపిఎంగా అప్పట్లో అడ్డుకున్నామని తెలిపారు. మళ్లీ ఇప్పుడు దాదాపు 100ఎకరాలకు పైబడి పేదలకు దక్కాల్సిన భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆరో పించారు. రెండు రోజుల క్రితం యంత్రాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారని, వాటిని సీజ్ చేసి అక్రమదారులపై ల్యాండ్ గ్రాబలింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు అర్హులైన పేదలకు భూములను సర్వే చేసి చూపించాలన్నారు. లేనిపక్షంలో పేదలతో భూపో రాటం చేసి, పంచుతామని వారు హెచ్చరించారు. పర్యటనలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, మండల కమిటీ సభ్యులు గోవింద స్వామి, రెబ్బా నర్సింహులు, నాయకులు గురు బ్రహ్మచారి పాల్గొన్నారు.

చదును చేసిన పొలంలో పర్యటిస్తున్న సిపిఎం బృందం

ఎయిడ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

ఎయిడ్స్ ప్రచార రథాన్ని ప్రారభిస్తున్న డాక్టర్ మంజుల

ప్రజాశక్తి - వేంపల్లె

హెచ్‌ఐవిని నిర్మూలించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. గురువారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి వద్ద హెచ్‌ఐవి ప్రచార రథాన్ని డాక్టర్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపి ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆయా పరిసర గ్రామీణా ప్రాంతాల్లో ప్రచార రథంపై హెచ్‌ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వేంపల్లె నుండి వెల్లటూరు వరకు హెచ్‌ఐవి ఎయిడ్స్ ప్రచార రథాన్ని ప్రతి గ్రామంలోకి వెళుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ ఆంజనేయులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ వలి, డిఆర్‌పీ లింక్ వర్కర్ స్కీం అల్లావల్లి, సంధ్యారాణి, ఓబులయ్య, సిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవి నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

హెచ్‌ఐవి నివారణకు జాగ్రత్తలు పాటించాలని వర్కర్ స్కీం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ ప్రతినిధి దర్బార్‌వల్లి తెలిపారు. మండల పరిధిలోని పెద్దగురువలూరు గ్రామంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులు మానసికంగా బాధ పడుతున్నారన్నారు. ఎయిడ్స్ గురించి తెలుసుకొని ఆరోగ్యంగా జీవించాలన్నారు. పెళ్లికి ముందు శృంగారం హెచ్‌ఐవి/ఎయిడ్స్‌కు శ్రీకారం అన్నారు. ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించడి.. వ్యాధి వచ్చిన వారిని ఆదరించండని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు చేయిచేయి కలిపి దేశం నుంచి పారదోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి సురేంద్ర, ఎఎన్ఎం శశి రాణి, జిఎంఎస్ కే ముబినా, ఆశా వర్కర్ గౌరిదేవి పాల్గొన్నారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులను బయటకు పంపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో పాఠశాల నడుపుతూ తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ముద్దనూరు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ నాయుడు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ముద్దనూరు పట్టణ నాయకులు ప్రయివేటు పాఠశాలలను సందర్శించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం దసరా సెలవులు ఇవ్వకుండా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలలను సందర్శించగా దసరా పండుగ సెలవులు ఇవ్వకుండా పాఠశాల నడుపుతున్న ఓ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు సెలవులు ఇప్పించినట్లు చెప్పారు. పరీక్షలు కూడా నిర్వహించడం దారుణమన్నారు. మిగతా ప్రయివేట్ పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా స్వచ్ఛందంగా విద్యార్థులకు సెలవులు ఇచ్చారన్నారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు చరణ్, రుద్రతేజ పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ కొనసాగింపుపై చర్చించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 294 హైస్కూల్ ప్లస్‌లను యథావిధిగా కొనసాగించాలని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మండలి సమావేశాల్లో చర్చించాలని పిజిటి అసోసియేషన్ జిల్లా కన్వీనర్ చెరుకూరు శ్రీనివాసులు కోరారు. గుంటూరులో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తికి పిజిటి అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనువాసులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ కళాశాలను రద్దు చేయకుండా ప్రస్తుత ప్రభుత్వంతో మండలిలో చర్చించాలని కోరారు. స్పం దించిన ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ ఎడ్యుకేషన్ సెక్రటరికి హైస్కూల్ ప్లస్ కొనసాగించాలని ఫైళ్లు పెట్టినట్లు చెప్పారు. వాటిపై చర్చకు తెస్తా మన్నారు. శాసన మండలిలో గట్టిగా వాటిపై తమ వాణిని వినిపిస్తామని ఆయన పేర్కొన్నారు. పిజిటి ఉపాధ్యాయులను కొనసాగించేందుకు, రెగ్యులర్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించాలని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులను డీఎస్సీ తర్వాతనైనా భర్తీ చేయాలని మంత్రి లోకేష్‌కు విన్నవిస్తామని చెప్పినట్లు శ్రీనివాసులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పిజిటి ఉపాధ్యాయులున్నారు.

ఎమ్మెల్సీ గోపి మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనువాసులు

ఓట్ల చోరీని ఎన్నికల కమిషన్ అరికట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఓట్ల చోరీని, ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను ఎన్నికల కమిషన్ అరికట్టాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఓట్ల చోరీని అరికట్టాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం సక్రమంగా నడవాలంటే ఏదోక వ్యవస్థ అవసరమన్నారు. అందులో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశానికి అనుకూలంగా ఉంటుందని, మన రాజ్యాంగ నిర్మాతలు మనకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇచ్చారని పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణవాయువని తెలిపారు. ఇందుకు సక్రమమైన ఓటర్ల జాబితా గుండె లాంటిదని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ ఓటరు జాబితా తప్పుల తడకగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, నర్రెడ్డి అలివేలమ్మ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, బండారు వెంకటేశు, రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, బుల్లెట్ రాజా, చిన్న కోట్ల నాగరాజు, రామాంజనేయరెడ్డి, మాబు, రవి, రాఘవయ్య, షేక్ జిలాని బాషా, సాయికుమార్ రెడ్డి, ఖాదర్, అబ్దుల్, నరేంద్ర, ప్రసాద్‌రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అధిక ఛార్జీలను నియంత్రించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

దసరా పండుగ సందర్భంగా బస్సుల యజమా నులు వసూలు చేసే అధిక రేట్లను నియంత్రించాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ కోరారు. ఆ మేర కు గురువారం ఆర్‌టిఒ మనీషాకు వినతిపత్రం సమ ర్పించారు. అనంతరం విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు పండుగ సెలవులను ఆసరా చేసుకుని బస్సు టికెట్ల రేట్లను విపరీతంగా పెంచి ప్రజ లను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నుండి హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, విజయవాడకు ప్రయివేట్ ట్రావెల్స్ నడుస్తున్నాయన్నారు. సాధారణ రోజులలో ఒక రేటు.. పండుగ రోజులలో మరో రేటు పెట్టి వేలాది రూపా యలు వసూ లు చేస్తున్నారని వివరించారు. సింగిల్ డ్రైవర్లను సర్వీసు రూ ట్లకు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడు తున్నారని పేర్కొన్నారు. అధిక టికెట్లపై రవాణా శాఖ అధి కారులు చూస్తూ ఉన్నారే తప్ప, చర్యలు తీసుకున్న దాఖ లాల్లేవన్నారు. తక్షణమే తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

ఆర్‌టిఒకు వినతిపత్రాన్నిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రతిష్టను పెంచేందుకు కృషి చేయాలి

వేంపల్లె: ఆర్జీయూకేటీ యూనివర్సిటీ ప్రతిష్టను పెంచేందుకు విద్యార్థులు తమ సృజనాత్మకతను పెంచుకోవాలని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఎస్పిఒకే కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ పేర్కొన్నారు. గురువారం ఇడుపులపాయిలోని ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో స్మార్ట్ ఇండియా-2025 హ్యాకథాన్ నిర్వహించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు అభివృద్ధి చేసిన వివిధ విభాగాల వారీగా అప్లికేషన్లు ప్రదర్శించారు. 106 మంది టీమ్స్ ప్రదర్శించగా అందులో 50 ఉత్తమ టిమ్స్‌ని జాతీయ స్థాయిలో ఎన్నుకొని ఫైనల్‌కు పంపిస్తామని డైరెక్టర్ చెప్పారు. డీన్ ఆఫ్ అకడమిక్స్ రమేష్ కైలాష్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

దసరా ఉత్సవాల్లో ఎంపీ అవినాష్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దసరా ఉత్సవాల్లో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పట్టణంలోని అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆర్యవైశ్య సంఘం పిలుపుమేరకు ఎంపీ అమ్మవారిని దర్శించుకున్నారు. పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్ పర్సన్ వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు

గిరిజన కుటుంబానికి చెందిన వారసత్వ భూమికి సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పుల్లయ్య డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డిని కోరారు. గురువారం మండల పరిధిలోని శ్రీరాములపేట గ్రామంలో డిటి ఆధ్వర్యంలో గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ శ్రీరాముల పేట గ్రామానికి చెందిన నల్లగొండ లక్ష్మయ్య నుండి వారసత్వంగా మల్లేష్‌కు సర్వేనెంబర్ 90/2ఏలో 0.49 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమికి సంబంధించి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో లేదన్నారు. బాధితులు కార్యాలయం చుట్టూ సంవత్సరాల పాటు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మల్లేష్‌కు తగిన న్యాయం చేయాలన్నారు. డిటి కృష్ణారెడ్డి స్పందిస్తూ పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితునికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎరుకల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, బాధితుడు మల్లేష్ పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధ్యాన దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ఈనెల 27 నుంచి 29వతేదీ వరకు మూడు రోజులపాటు ధ్యాన దసరా ఉత్సవాలను పొట్లదుర్తి దగ్గర ఉన్న పిరమిడ్‌లో నిర్వహిస్తున్నట్లు ధ్యాన కేంద్రం అధ్యక్షురాలు కాకుమాని ప్రతిషా తెలిపారు. ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి జ్ఞాన కేంద్రం అధ్యక్షురాలు పరిణిత పత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ప్రభ, అనిల్‌కుమార్, జాయింట్ ట్రెజరర్ జయలక్ష్మి, సృజనాదేవి పాల్గొన్నారు

నూతన కమిటీతో ఎంపిజె నేతలు

ఎంపిజె కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని బంగారు అంగళ్ల దుకాణాల వద్ద గురువారం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం తెలిపారు. రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండీ అయూబ్ ఖాన్, కడప జిల్లా అధ్యక్షులు జాకీర్ ఉమ్రి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక కోసం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కమిటీ ఏర్పాటు చేసి నియామకపత్రం అందించారు. పట్టణ అధ్యక్షులుగా లియాజ్ ఖాన్, కార్యదర్శిగా ఖాజపీర్, కోశాధికారి మారుతీరావు, 20 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అబ్దుల్ గని, ఎంపీజే సభ్యులు ముక్తియార్, అల్లా బకాష్, అన్వర్, మొహిద్దిన్. ఖాదర్‌బాషా, ఖలందర్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై సమావేశం

ప్రజాశక్తి-చాపాడు : గ్రామపంచాయతీల పురోగతి సూచికపై శుక్రవారం మండల సభా భవనంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వీర కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ఎంపిపి, జడ్‌పిటిసి హాజరు కావాలని కోరారు. సభ్యులకు పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ గురువారం పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. జైలులో ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు పరిసరాలు, రిజిష్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం చేశారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్ర దించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూప రింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 1/2024

M. Raja Reddy, S/o. M. Nagi Reddy, Hindu, aged about 43 years, Private Employee, resident of D.No.45/436, Balaji Nagar, Kadapa City & District. **...Plaintiff**

Vs

P. Venkata Subbaiah, S/o.Venkata Swamy, Hindu, aged about 45 years, Business, resident of D.No. 45/437, Balaji Nagar, Kadapa City & Distrcit. **...Defendant**

SUMMONS

పై కేసు లోని వాది, ప్రతివాది అయిన మీ పైన అతనికి రావలసిన ప్రోనోటు బాపతు మొత్తం ను రాబట్టుకోనుటకు గాను పై నెంబర్ దావానున పై కోర్ట్ నందు దాఖలు చేసియున్నాడు. ఇందు విషమమై మీకు ఆక్షేపణలున్న యెడల పై కోర్టు నందు 27.11.2025 వ తేదిన ఉదయం 10.30 ని॥లకు కుద్దున గాని, వకీలు ద్వార గాని పై కోర్ట్ నందు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేని ఎడల సదరు విషయమై పరోక్షముగా విచారించి తీర్మాణము చేయుదరని తెలియజేయడమైనది.

వాయిదా: 27.11.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

R.SURYA PRAKSH REDDY
Advocate for Plaintiff
Kadapa City & District.